కౌలు ధరలకు రెక్కలు

- కౌలుకు తీసుకునేందుకు వెనుకాడుతున్న రైతులు
- కౌలు ఎకరా రూ.35 వేలు నుంచి రూ.40 వేలు
- కౌలు ముందే చెల్లించాలంటున్న యజమానులు


పంట వేసేందుకు పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

జే.పంగులూరు: ప్రతి ఏడాది కౌలు భూముల ధరలు పైపైకి ఎగబాకుతూనే ఉన్నాయి. గతేడాది పోలిస్తే ఈ సంవత్సరం కౌలు ధరలకు రెక్కలు వచ్చాయి. మిర్చి పంటకు గిట్టుబాటు ధర రావటం కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో కౌలు రైతులందరూ ఆలోచించాల్సి వస్తుంది. కారణం వారిలో రైతులందరూ 80 శాతం దళితులే.

మిర్చి సాగు..


ఈఏడాది మిర్చి సాగు మండలంలో 14 నుంచి 16 వేల ఎకరాలు పైచిలుకు పంట సాగు చేసే అవకాశం ఉంది. గత సంవత్సరం సకాలంలో వర్షాలు పడ్డాయి. మిర్చి పంటకు నీరు సమృద్ధిగా అందటమే కాక మంచి ధర పలికింది. ఆదిలోనే మిర్చి పంటకు జెమినీ వైరస్ వచ్చినా అనుకున్నస్థాయిలో పంటకు ఇబ్బంది లేకుండా పోయింది.

కౌలు ధరలు..

ప్రస్తుతం ఎకరా మిర్చి పంట వేసేందుకు కౌలు రూ. 35 వేలు నుంచి రూ.40 వేలు వరకు ఉంది. శనగ పంట వేసేందుకు ఎకరా కౌలు రూ. 25 నుంచి రూ.30 వేలు పలుకుతోంది. ఈ కౌలు కూడా జులై, ఆగస్టు మాసాల్లో కౌలు చెలించాలి. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం గత రెండేళ్లుగా శనగ పంటకు మంచి గిట్టుబాటు ధర కల్పించింది. దీనితో రైతులు దళారులకు పంట అమ్మకుండా నేరుగా మార్కెట్ యార్డులకు అమ్ముకొని లాభాల బాట పట్టారు. సంవత్సరాల కొద్ది శీతల గిడ్డంగులలో ఉన్న శనగపంట మొత్తం అమ్ముడు పోయింది. శనగ పంట వేసేందుకు రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. శనగ పంట పొలాలకు కూడా కౌలు అమాంతం పెరిగిపోయింది.

వరి పంటకు కౌలు రూ. 25 వేలనుంచి 30 వేలు..

గత రెండు సంవత్సరాల నుంచి మండలంలో ఎన్నడు లేని విధంగా మగాణి పంటలు పండాయి. దాదాపు పదేళ్లయింది మండలంలో వరి పంట పండి. సకాలంలో వర్షాలు పడటం, సాగరు కాలువ నీరు సమృద్ధిగా అందటం, గిట్టుబాటు ధర ఉండటంతో ఈఏడాది కౌలు అమాంత పెరిగి పోయింది. వరి పంటకు కౌలు రూ. 25 వేలు నుంచి రూ. 30 వేలు తీసుకుంటున్నారు.


పంట వేసేందుకు కంపను తగలబెడుతున్న కౌలు రైతు (ఫైల్)

కౌలుకు తీసుకోవాలంటే భయం వేస్తోంది..



పొలాలు కౌలుకు తీసుకొని వేసి అవి నష్టాలు వస్తే వడ్డీలు కటడం కంటే, కూలి పని చేసుకోవడం ఉత్తమం. సాయంత్రానికి వచ్చిన కూలి డబ్బులతో ప్రశాతంగా బతకొచ్చు. ముందుగా కౌలు కట్టి, పెట్టుబడికి అప్పు తెచ్చి పంట పండించడం కష్టంగా ఉంటుందిన. ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తున్నా కౌలు ధరలు చూస్తే భయం వేస్తోంది.

– టీ ఏసుబాబు, కౌలు రైతు, బూదవాడ

ప్రస్తుతం కౌలు తట్టుకునే పరిస్థితి లేదు..



గతేడాది నేను నాలుగు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. దానిలో రెండు ఎకరాలు ఆదిలోనే బొబ్బర తెగులు వచ్చి పాడయింది. బొబ్బర స్థానంలో మిర్చి సాగుచేశా. మిగిలిన రెండు ఎకరాలు మిర్చి పంట కాపునకు వచ్చిన తరువాత బొబ్బర వచ్చింది. అది కాస్త కాసింది. మిర్చి పంటకు పంటకు ధర ఉంది. కావున ఈఏడాది నష్టాలు లేకుండా దానికి దానికి సరిపోయింది. కాని ఈఏడాది కౌలు చూస్తే పంట వేద్దామమా వద్దా అనిపిస్తోంది.

– నూతలపాటి సురేష్, కౌలు రైతు, బూదవాడ

క్లుప్తంగా

ఘనంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న ఊర అంకమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. యాజ్ఞికులు నారాయణం శ్రీనివాసాచార్యులు, వెంకట సందీప్ దీక్షిత్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, సుదర్శన హోమం, కుంకుమార్చనలు, శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు, సారె, పూలు, పండ్లు, పాలపొంగళ్లు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభను కనపరచిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

మేదరమెట్ల: ఏపీ చెస్ అకాడెమీ ఆధ్వర్యంలో ఒంగోలులో శనివారం నిర్వహించిన చెస్ పోటీల్లో మేదరమెట్ల రాధాస్ గీతం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. అండర్ 11 నుంచి 14 వరకు నిర్వహించిన స్టేట్ లెవెల్ పోటీల్లో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులకు పతకాలు, ప్రశంస పత్రాలు సాధించినట్లు స్కూల్ ప్రతినిధులు తెలిపారు.

మణిపూర్‌లో దాడులు హేయమైన చర్య


శాంతి ర్యాలీ నిర్వహిస్తున క్రైస్తవులు


బల్లికురవ: మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బల్లికురవ మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. సోమవారం బల్లికురవలో ప్రజాసంఘాల క్రైస్తవుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘ అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగే దాడులకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, దాడులకు పాల్పడే వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని కోరారు. మణిపూర్‌ను కాపాడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు ప్రత్తిపాటి నాగయ్య మాదిగ, బల్లికురవ పాస్టర్ షరేష్ ప్రజాసంఘాలు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్‌లు తప్పనిసరి


నర్సరీలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): నర్సరీలు లైసెన్స్‌లు తప్పనిసరిగా పొందాలని మార్టూరు ఉద్యాన అధికారి బి. హనుమంతనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ నర్సరీ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం నియమ నిబంధనలు పాటించాలన్నారు. మిరప, కూరగాయాలు, పూల మొక్కల నారు పెంచదలచుకున్న యజమానులు విధిగా నెట్ హౌస్‌లోనారు పెంపకం చేట్టాన్నారు. కీటకాలు లోనికి ప్రవేశించకుండా నెట్ హౌస్ చుట్టూ లోసైజ్ 2 మీటర్లు, 3 మీటర్లు 2.5 మీటర్లతో తలుపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బల్లికురవ మండలంలో నాలుగు నర్సరీలకు లైసెన్స్‌లు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బాలింతలకు ఆరోగ్యం


పౌష్టికాహారం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని చెరుకూరు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి దండమూడి కృష్ణజ్యోతి అన్నారు. రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని కొమర్నేని వారిపాలెం పంచాయతీ కార్యాలయం నందు కొమర్నేని వారిపాలెం, రమణాయ పాలెం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో 15 రకాల ఆహార పదార్థాలను వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి ఆంజనేయులు, పోలిశెట్టి చంద్రం, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలూరి రమాదేవి, కట్టా అరుణ, నర్సులు, ఆశ కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- కౌన్సిల్ సమావేశంలో 77 అంశాలు ఆమోదం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

చీరాల: అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పనిచేయాలన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అనంతరం అజెండాలోని 78 అంశాలపై చర్చ నిర్వహించగా ఒక అంశమైన ఎన్ఆర్‌పీఎం స్కూల్ వద్ద గల కాంప్లెక్స్‌లో షాపు నెం 5 లీజు కాలం ముగుస్తున్న కారణంగా మూడు సంవత్సరాలు లీజు పెంచేందుకు లీజుదారుడు అర్జీ అందించాడు. కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్ మాట్లాడుతూ షాపుకు బకాయి ఎంత ఉందో అధికారులు పూర్తి స్థాయిలో లెక్కలు చెప్పాలన్నారు. కౌన్సిలర్లు అందరూ ప్రశ్నించడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. అనంతరం జరిగిన జీరో అవర్‌లో ఐదో వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి మాట్లాడుతూ తమ వార్డులో ఇనుప విద్యుత్ స్తంబాలు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాత స్తంబాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని, మిగిలినవి మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ ఈసర్ల సుజాత మాట్లాడుతూ తమ వార్డులో మురుగు కాలువలు, రహదారి పనులు చేయాల్సి ఉందని వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల శ్రీరాములు మాట్లాడుతూ దండుబాట ప్రాంతంలో కొన్ని వార్డుల పరిధిలో ఇళ్ల మధ్యన, రోడ్డు పక్కన చిల్లచెట్లు ఏపుగా పెరిగి అడవిలా ఉన్నాయన్నారు. కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో చిల్లచెట్ల కారణంగా అపరిశుభ్రంగా ఉందన్నారు. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల శ్రీరాములు మాట్లాడుతూ పట్టణంలో కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రభుత్వ మద్యం షాపు పెట్టేందుకు పనులు జరుగుతున్నాయని, నిత్యం రద్దీగా ఉండే షాపుల వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయడం ఇబ్బందిగా ఉంటుందని వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డిఈ ఏసయ్య, వేటపాలెం తహశీల్దార్ అశోక్‌వర్ధన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సమావేశాలు


ఆర్‌డబ్ల్యూఎస్ జేఈతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రజనీశ్రీనివాసరావు

కారంచేడు: ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమవేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల రేషన్ షాపులకు డీలర్లను నియమించే క్రమంలో కనీస సమాచారం లేకుండానే నియామకాలు చేశారని తహశీల్దార్‌ను ప్రశ్నించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెంటనే నియామకాలు చేయాల్సి వచ్చిందన్నారు. జల్‌జీవన్ పథకం ద్వారా గ్రామంలో నూతన పైప్ లైన్ నిర్మాణ పనులు జరిగాయని, వీటిలో తీసేసిన పాత పైపుల ఆచూకీ లేవన్నారు. అవి ఏమయ్యాయో సభకు తెలపాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవిబాబును ప్రశ్నించారు. నేను నూతనంగా వచ్చానని విచారణ చేసి తెలియజేస్తానన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కూలిన పశువుల ఆసుపత్రి పైకప్పు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వాసుబాబు తెలిపారు. అవసరమైతే స్లాబ్‌ను నూతనంగా నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. మండలస్థాయిలోని ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, తహశీల్దారు ఎస్ వెంకటరత్నం, పరిపాలనాధికారి లక్ష్మీనారాయణ, ఇంకొల్లు సీడీపీవో ఝాన్సీ, డాక్టర్ జెస్సీరాణి, డాక్టర్ షాలినీ, ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, ఎంఈఓ సత్యన్నారాయణ, ఏపీఎం మధుసూదనరావు, ఏపీఓ ప్రదీప్, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చీరాల రూరల్: భూ వివాదంలో న్యాయవాదిని అత్యంత కిరాతకంగా హత్యచేసినందుకు నిరసనగా సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్ బాబు, కటకం చంద్రశేఖరరావులు మాట్లాడారు. భూ విషయమై అద్దంకి కోర్టులో హాజరై విజయవాడ వెళ్తున్న వితల్‌బాబు అనే న్యాయవాదిని తన ప్రత్యర్థి వ్యక్తులు కేసును రాజీ చేసుకుందామని న్యాయవాదిని నమ్మించి అత్యంత పాశవికంగా హత్యచేసి పొలాల్లో పూడ్చి పెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాలను అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదిని హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్షలు అమలు చేయాలని వారు కోరారు.

జవాబుదారీతనంగా పనిచేయాలి

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందంచడంతో పాటుగా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తు అందుబాటులో ఉండాలన్నారు. వివిధ ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డిటీ సురేష్, ఆర్ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాగిరెడ్డికి వివేకానంద అవార్డు


నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఏపీ, తెలంగాణ ఎన్‌జీఓ ప్రతినిధులు

కారంచేడు: రాష్ట్రాల్లో అందించే స్వచ్ఛంద సంస్థల సేవలను గుర్తించి నిర్వాహకులను ఏపీ, తెలంగాణ ఎన్‌జీఓల అసోషియేషన్ అవార్డులతో ఘనంగా సత్కరించింది. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు, ఏపీ ఎన్‌జీఓల రాష్ట్ర ప్రతినిధి మున్నంగి నాగిరెడ్డిని నిర్వాహకులు వివేకానంద అవార్డుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసం రామకుమార్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ ఐలా ఈశ్వరయ్య, నిజాం కాలేజ్ అనంతయ్య డాన్స్ అకామీ ప్రతినిధి జ్యోతిరెడ్డి, లక్ష్మీ సాంమ్రాజ్యం, మద్ది రాజలింగంగౌడ్, అనంతాచారి, మాధవరెడ్డి ఏపీ, తెలంగాణా ప్రధనిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలు పరిష్కరించాలి


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

చినగంజాం: పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ పీ పార్వతి అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజలిచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచరాదని, దాదాపు అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సిబ్బంది సేవలను అందించాలని, ప్రజలను కార్యాలయం చుట్టూ పలు మార్లు తిప్పకుండా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శ్రీకాంత్, డీటీ సుబ్బారావు, వీఆర్వోలు సత్యనారాయణ, చెంచుపున్నమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సువార్త దిన వేడుకలు


హాయర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జోసఫ్ కేరి, దేవదాసు

చీరాల రూరల్: స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చితో పాటు జాన్‌పేట, శాంతి నగర్, ఉజిలిపేట, కొత్తపేటలోని ఐఎల్‌టీడీ కాలనీలోని లూథరన్ చర్చిల్లో 182వ సువార్త దినం వేడుకలను సోమవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ జాన్ క్రిష్టియన్ ఫ్రెడ్రిక్ హయర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ హయర్ విదేశాల్లో జన్మించినప్పటికి మన దేశం వచ్చి లూథరన్ సంఘాన్ని ఏర్పాటుచేసి ఎంతోమందిని క్రైస్తవ విశ్వాసంలోకి నడిపించారని వారు కొనియాడారు. ఆయన తన సొంత ఆస్తులతో మిషనరీలను ఏర్పాటు చేసి నిరుపేదలకు విద్య, వైద్యం అందించిన విషయాలను వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ యెరిచర్ల రమేష్ బాబులు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్, స్త్రీల సమాజం, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు


వృద్ధురాలికి నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పేద కుటుంబాల్లో సంక్షేమ పథకాలను అందిస్తూ వారి గుండెల్లో నిలిచిపోయారని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయతీ పరిధిలోగల మాలెంపాటివారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాలకు సంబంధించిన బుక్‌లెట్ అందజేశారు. గ్రామానికి విచ్చేసిన చైతన్యకు ప్రజలు పూలమాలలతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మాజీ సర్పంచ్ రావిశ్రీధర్, మండల, స్థానిక నాయకులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నీటి పథకాల అభివృద్ధి
- సభ్యుల ఏకగ్రీవ తీర్మానం


ఎజెండాలోని అంశాలను చదివి వినిపిస్తున్న ఆర్ఐ అర్జున్‌రావు

అద్దంకి రూరల్: పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అభివృద్ధిల పనులకు కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ ఆధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసమావేశంలో 58 అంశాల ఎజెండాను ఆర్ఐ అర్జున్‌రావు చదివినిపించగా కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. అన్నింశాలు ఆమోదించినట్లు చైర్మన్ ప్రకటించారు. ఆయా అంశాల్లో గుండ్లకమ్మ నదిలోని ఇన్ ఫిల్ట్రేషన్ బావుల్లో నీటి మట్టం తగ్గినందున నీటి ఎద్దడిగా ఉన్న ప్రాంతాల్లో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయటానికి కౌన్సిల్ ఆమోదం పొందింది. అలాగే విస్తరించిన బంగ్లా రోడ్‌లోని అభివృద్ధి పనులు, 10 సచివాలయాల అభివృద్ధి పనులకు, మున్సిపాలిటీ పరిధిలోని దోమలు ప్రబలకుండా సచివాలయానికి ఒకటి చొప్పున 10 స్ప్రేయర్ల కొనుగోలుకు అమోద ముద్రవేశారు. సాధారణ నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాల్లో భాగంగా గరటయ్య కాలనీలోని 18, 19, 20, 21వ వీధుల్లో ఒక్కో లైన్‌కు రూ. 3.45 లక్షల చొప్పున, 1 వవార్డులోని డంపింగ్ యార్డు వద్ద కరెంట్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు రూ.12 లక్షలు, 12వ వార్డులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో, 1,2,3,5,7, 8.13,14,17,19,20 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా అమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మేష్, మున్సిపల్ కమిషనర్ బీ. శ్రీనివాసులు, టౌన్ ప్లానింగ్ నారాయణ రావు, ఇన్‌చార్జి ఏఈ మరియదాసు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చీరాలలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మిని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని యువతీయువకులు జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో స్కిల్ క్రాఫ్ట్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ డిప్లొమో, ఏదైనా డిగ్రీ, పీజీ, బిటెక్ విభాగాల వరకు చదువుకున్న 18–28 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

సొన భూముల పూడ్చివేతపై ఉద్రిక్తత

వేటపాలెం: మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ శివారులో వివేకానంద కాలనీలో పక్కన భూముల్లో స్థలాల్లో సొనల పూడ్చివేతపై సోమవారం ఉద్రిక్తత నెలకొంది. చల్లారెడ్డిపాలెం పంచాయతీ సర్వే నంబరు 75-3లో సొన పోరంబోకు భూమి ఐదెకరాలు ఉంది. ఈభూమిలో 2003లో నివేశన స్థలాల ఏర్పాటుకు అప్పట్లో అధికాలు ప్రయత్నించారు. అయితే దానిపై కొందరు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు మూడెకరాల్లో ఇంటి స్థలాలు ఇచ్చుకోవచ్చని తీర్పు ఇచ్చారు. దీంతో ఆభూములను పది రోజులుగా చదును చేసి నూతనంగా లే అవుట్‌లు వేస్తున్నారు. అయితే ఇదే ప్రాంతంలో మరి కొందరు రైతుల భూములకు సంబంధించిన సొనలు ఉన్నాయి. వాటిని చదును చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఆ భూముల తాలూకా రైతులు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులతో కలసి ఆమంచి నూతనంగా లేఅవుట్ వేస్తున్న ప్రాంతానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. వెంటనే రెవెన్యూ అధికారులు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. తహశీల్దార్ అశోక్‌వర్ధన్ ఆమంచితో మాట్లాడి సమస్యను సానుకూలంగా పరిశీలించి ఐదురోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనితో ఉద్రిక్తలు సమసిపోయాయి.

ఇంటింటా వైద్యం

బల్లికురవ: మంచాల్లో ఉన్న వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు ప్రభుత్వం ఇంటింటా వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని 104 వైద్యాధికారులు భారతి, భూషణ్‌రావులు అన్నారు. సోమవారం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామల్లో 104 శిబిరంలో భాగంగా షుగర్, బీపీ, హెచ్‌డీ పరీక్షలు చేశారు. సాయంత్రం ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

చీరాల అర్బన్: పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు సోమవారం పట్టణంలోని పాపరాజుతోటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సంఘ నాయకులు మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం అన్ని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రిటైర్డు అయిన ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు నారాయణ, ఎల్‌వి రావు, సుబ్బారావు, వెంకట్రావు, జోసఫ్, రంగబాబు, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం

బల్లికురవ: మూడు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన విజయలక్ష్మీ సేవలు ప్రశంసనీయమని కొణిదెన యజ్ఞనారాయణ మెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేబీ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వియలక్ష్మీ దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. మూడు దశాబ్దాలుగా యద్దనపూడి, మార్టూరు, మండలాల్లో ఆమె పనిచేశారన్నారు.